క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సీతంపేట: శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా స్థానిక సీతంపేట గణేష్ నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భాస్కరశర్మ వేద మంత్రాలమధ్య స్వామి వారికి పంచామృతాలు, ఫలరసాలు, విభూది, చందన, పసుపు, కుంకుమలతో అభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారిని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అష్టోత్తర, సహస్ర నామార్చన చేశారు. పరిసర ప్రాంత భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకం చేశారు.

యోగసిద్ధాంజనేయుడికి శ్రావణ మాస పూజలు



మురళీనగర్: జాతీయ రహదారి సూర్యనగర్‌లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంత్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు, సింధూర అర్చన, తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం దీపధూప నైవేద్యాలు సమర్పించారు. యోగసిద్ధాంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణం చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు , ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కె.గోపాల్, చిరంజీవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు కిట్ల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శామ్యూల్ నేతృత్వంలో చిన్నారులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా నగర అంగన్‌వాడీ అధ్యక్షురాలు, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి సాయిలత, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పెద్దాడ జ్యోత్స్న పాల్గొని చిన్నారులకు కిట్లు అందజేశారు. వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యాక్టివ్ కార్యదర్శి పల్లా ఎర్నికుమార్ యాదవ్, వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం దరి దాలిరాజు సూపర్‌మార్కెట్ సమీపంలో గల వివేకానంద ఆస్పత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజన్ ట్రీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాటరాక్ట్, గ్లకోమా, రెటీనా వంటి పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి విజన్ ట్రీ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు నిమిత్తం బుధవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేట, శ్రీహరి వీధి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మట్టి గణపతులకు జైబోలో







మట్టితో చేసిన వినాయకుడికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు, పలు రకాల మట్టి విగ్రహాలు

కంచరపాలెం: ఆగస్టు 27న ప్రారంభమయ్యే వినాయక చవితి నవరాత్రి వేడుకల కోసం నగరంలో వినాయక విగ్రహాల తయారీ జోరందుకుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో, మట్టి గణనాథులకే ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ఏడాది సేవా సంఘాలు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేసి ప్రజల్లో చైతన్యం తెచ్చాయి. ఈ ఏడాది కూడా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవడానికి నగర ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కళాకారుల కృషి

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించడంలో తాము సైతం భాగమవుతామని విగ్రహ తయారీదారులు చెబుతున్నారు. కోల్‌కతా, ఒడిశాల నుంచి వచ్చిన కొంతమంది కళాకారులు కంచరపాలెం పరిధిలోని పరమేశ్వరి థియేటర్ అవరణ, మళ్లసూరివీధి, ధర్మనగర్, రామ్మూర్తిపంతులపేట, 104 ఏరియా, పైడిమాంబకాలనీ, జ్ఞానాపురం, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో ఈ ఏడాది కేవలం మట్టితో చేసిన విగ్రహాలను తయారు చేస్తున్నారు. అంతేకాదు, రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలనే ఉద్దేశ్యంతో స్వచ్ఛందంగా మట్టి విగ్రహాల తయారీకి పూనుకున్నారు.

కనువిందుగా మట్టి విగ్రహాల తయారీ

భక్తులను ఆకర్షించే విధంగా కళాకారులు విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. సాధారణంగా వైట్ సిమెంట్ అచ్చులలో వినాయక విగ్రహాలను తయారు చేస్తారు. అయితే, ఈ కళాకారులు చేతితోనే విభిన్న ఆకారాల మట్టి విగ్రహాలను తయారు చేయడం విశేషం. ఇది వారి సృజనాత్మకతకు నిదర్శనం.

ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తి



మాది ఒడిశా రాష్ట్రంలో ఓ మారుమూల గ్రామం. పాతికేళ్ల క్రితమే విశాఖ వచ్చేశాం. నా తండ్రి నుంచి వారసత్వంగా విగ్రహాల తయారీ చేపట్టా..కష్టమైనా, నష్టమైనా వీటిని తయారు చేస్తూ జీవిస్తున్నాం. హోల్‌సేల్ మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు పెంచి విక్రయాలు జరుపుతున్నాం.

–సుధీర్‌పాల్, కళాకారుడు, కోల్‌కతా

ఎనిమిది నెలలపాటు విగ్రహాల తయారీ



జీవనోపాధికి కళాకారులుగా మారాం. చిన్ననాటి నుంచి విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. పండగ సమయాల్లో కుటుంబాన్ని విడిచి ఎనిమిది నెలలు విగ్రహాలు తయారు చేస్తాం. డబ్బు సంపాదించి ఇళ్లకు చేరుతాం. నాతో పాటు అనేక మంది కళాకారులు ఇదే వృత్తిగా నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.

–జశ్వంత్‌పాల్, కళాకారుడు, ఒడిశా

విగ్రహాలకు డిమాండ్ ఉంది

భక్తులు కూడా మట్టి విగ్రహాలనే కోరుకుంటున్నారు. అయితే వీటి తయారీకి చాలా కాలం పడుతుంది. మూడు నెలల నుంచి విగ్రహాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే తయారు చేసిన విగ్రహాలు 95 శాతం అమ్ముడు (అర్డర్) కాబడ్డాయి. బొమ్మలపై మట్టి ఆరిపోయిన తరువాత రంగులు వేయడం మొదలు పెడతాం. ఇప్పటికే చాలా విగ్రహాలు సిద్ధం చేశాం.

–రాంబాబు, విగ్రహాల కాంట్రాక్టర్, ధర్మానగర్, కంచరపాలెం

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



శంకరమఠం రోడ్డులో నిరసన చేపడుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు శంకరమఠం రోడ్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి మాట్లాడుతూ ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న ట్రూ–అప్ విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు టీడీపీ గెలిస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక వాటిని భారీగా పెంచి ప్రజలపై భారం మోపడం అన్యాయమన్నారు. నారా లోకేష్ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని పెట్టాలని ప్రజలపై ఒత్తిడి తేవడం దుర్మార్గమని వామనమూర్తి విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, ట్రూ–అప్ చార్జీలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తే ప్రభుత్వం తప్పక దిగివచ్చి వాటిని రద్దు చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో యు. శివాజీ, కె. దేవుడు, ఎం. నాగరాజు, భాస్కర్, సతీష్, నర్సింగరావు, రాజు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంగళ గౌరీ వ్రతం



గౌరీదేవికి పూజలు నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్‌లోని గౌరీ సంక్షేమ సేవా సంఘం ప్రాంగణంలో మంగళవారం మంగళ గౌరీ దేవీ వ్రతం నిర్వహించారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పాల్గొని లోక కళ్యాణార్థం ఈ వ్రతం నిర్వహణకు సహకరించారు. భారీ సంఖ్యలో మహిళలు అమ్మవారికి కలశారాధన, కుంకుమ పూజలు నిర్వహించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. కార్యక్రమంలో గౌరీ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

గాయని సత్యవతికి సత్కారం



గాయని సత్యవతిని సత్కరిస్తున్న కట్టా మల్లేశ్వరరావు

సీతంపేట: సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గాయని సత్యవతి ఖాన్‌ను ఘనంగా సత్కరించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో భాగంగా, మూడు దశాబ్దాల పాటు గాయనిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమెను సంస్థ గౌరవాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, పి.బి. ఖాన్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో నగరానికి చెందిన గాయనీ గాయకులు పెమ్మరాజు రామ్, ఎం. శ్రీనివాసరావు, కె.ఎల్. రావు, రామనర్సింహం, సుబ్బారావు, నాయుడు, ఖాన్, రంజిత, మాధురి, అంబిక, గంటి ఉష, ఎస్. రాజేశ్వరి అనేక యుగళ గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు.

ఆస్పత్రుల్లో పారదర్శక సేవలకు వినతి



డాక్టర్ రాధారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్టు 2010ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఆరోగ్య సేవలపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్ కోరింది. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణికి కౌన్సిల్‌కు చెందిన కె.రాము వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రులు ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 రూపొందించారని రాము మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత కార్యాలయం ముందు పోస్టర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

జూలో చిత్రలేఖన పోటీలు




జూలో చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులులపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు నగరంలోని పలు పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూ అధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో పులులు కీలక జాతులని తెలిపారు. విశాఖ జూలో రాయల్ బెంగాల్ టైగర్స్, తెల్ల పులులు సందర్శకులను అలరిస్తున్నాయని తెలిపారు. పులులుపై అవగాహన కల్పించడానికి జూలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అనంతరం పులులకు సంబంధించిన డాక్యుమెంటరీని స్క్రీన్‌పై విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట: జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా దాసరి వెంకటరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రమణ, కోశాధికారిగా కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎ.వి. శ్రీను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మంగళవారం జిల్లా సహకార శాఖ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి కార్యవర్గ సభ్యులను పరిచయం చేసింది.

ప్రజలకు చేరువగా న్యాయ సేవలు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: ప్రజలకు న్యాయ అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో విశాఖ ఉమ్మడి జిల్లాల జాగృతి యూనిట్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడమే జాగృతి పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అందించే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్15100 ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఆరిలోవ : రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన గోదాంను సందర్శించారు. గతంలో దానికి వేసిన సీలును పరిశీలించారు. గోదాం చుట్టూ, లోపల ఉన్న సీసీ కెమెరాల పనితీరు పరిశీలిచారు. గోదాం రక్షణ, భద్రతా ప్రమాణాలపై ఆయన ఆరా తీశారు.

చంద్రబాబు అంటేనే మోసం, దగా..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' సభలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- గాలికి కొట్టుకుపోయిన 'సూపర్ సిక్స్': మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

తాటిచెట్లపాలెం: చంద్రబాబు అంటే గుర్తుకొచ్చేది మోసం, దగా అని, వీటితోనే ఆనాడు సొంత మామనే మోసం చేసి తెలుగుదేశం పార్టీని లాక్కున్నారని, నేడు మళ్లీ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు విమర్శించారు. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని జీవీఎంసీ 42వ వార్డులో, వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో సుబ్బలక్ష్మీనగర్‌లోని సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేకే రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు 'సూపర్ సిక్స్' అని ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, నేడు వాటిని అమలు చేయలేమని సొంత పార్టీ నేతలే వీటిని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని అంటున్నారన్నారు. ఎన్నికల ముందు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలు ఆశపడటంలో తప్పులేదని, ఆనాడు జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాల కంటే ఎక్కువ ఇస్తానని మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. ఎన్నికల ముందు ప్రశ్నిస్తానన్న మరో నాయకుడు కనీసం పత్తాలేకుండా పోయారని విమర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు చంద్రబాబు నాయుడు ప్రజలను ఎలా మోసం చేశారో తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 18–59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తానన్నాడని, ఇచ్చాడా? ఇవ్వలేదు, సరికదా ఇప్పుడు ఆ పార్టీ నాయకుడు అచ్చెన్నాయుడు ఏమన్నారో విన్నారు కదా? అలా ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటున్నాడు. నిరుద్యోగభృతి అన్నాడు, ఇచ్చాడా? రూ. 3 వేలు, సంవత్సరానికి రూ. 36 వేలు, ఇలా ఎన్నో హామీలు గాలికొదిలేశారు. చంద్రబాబు ఇలా ఒక్కో కుటుంబానికి సుమారు సంవత్సరానికి లక్ష రూపాయలు ఎగనామం పెట్టేశారని, అలా చూస్తే సుమారు రూ. 30 వేల కోట్లు సంవత్సరానికి ఇవ్వాలని, ఇప్పటికే ఒక సంవత్సరం ఎగ్గొట్టేశారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు సమస్యలను తమ సమస్యలుగా తీసుకుని, ప్రజలందరినీ, ముఖ్యంగా కార్యకర్తలందర్నీ కంటికి రెప్పలా కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, నియోజకవర్గ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, బూత్ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.





కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేకే రాజు, వాసుపల్లి, కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు

ఇలా అయితే వెళ్లేదెలా?



నందగిరినగర్‌లో ఇరుకు మార్గంలో వెళుతున్న చిన్నారులు

సీతంపేట: జీవీఎంసీ 43, 44, 26 వార్డుల్లో నిరంతర తాగునీటి సరఫరా కోసం జరుగుతున్న అమృత్ 2.0 పనులు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా 43వ వార్డులోని నందగిరినగర్‌లో సుపథ స్కూల్ రోడ్డులో పైప్‌లైన్ల పనుల నిమిత్తం తవ్విన గోతులు, రోడ్డుపై పోసిన మట్టి కుప్పలతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలే కాకుండా, పాదచారులు సైతం నడవలేని విధంగా మట్టి పోగులు వేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాల విడిచిపెట్టిన తర్వాత చిన్నారులు ఇంటికి వెళ్ళడానికి మార్గం లేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రజల రాకపోకలకు, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

సోలార్ వినియోగానికి సబ్సిడీ రుణాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, ఎస్ఈ శ్యామ్‌బాబు, ఈఈ నాయుడు

కంచరపాలెం: స్థానిక నేతాజీ ఫ్లైఓవర్ వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్–2 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని సదస్సును ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులకు మేలు చేసే రీతిలో పలు రాయితీలు అందిస్తున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్ఈ జి.శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఈ పథకం వల్ల అతి తక్కువ కరెంట్ బిల్లు వస్తుందన్నారు. జోన్–2 విద్యుత్ విభాగం ఈఈ బి.కె.నాయుడు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు సోలార్ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చన్నారు. సోలార్ వినియోగంపై అతిథులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి. సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్, పుట్టా వాసు, ఏఈలు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పాపాహోంకు ఫోర్త్ టౌన్ పోలీసుల వితరణ



పాపాహోంకు బియ్యం బస్తాలు అందజేస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

తాటిచెట్లపాలెం: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పాపా హోమ్‌లోని పిల్లలకు బియ్యం బస్తాలు అందజేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా పాపా హోమ్ నిర్వాహకులకు బియ్యం బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్టేషన్ సిబ్బంది తమ సొంత డబ్బుతో నిర్వహించినట్లు సత్యనారాయణ తెలిపారు.